క్లుప్తంగా

ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయాలి



మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ఆరు వాగ్దానాలను అమలు చేయాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా రాష్ట్ర నాయకుడు నంది రామయ్య డిమాండ్ చేశారు. కరీంనగర్ ఉమ్మడి జిల్లా కమిటీ సమావేశం ఆదివారం గోదావరిఖనిలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్త్రీలకు ఉచిత బస్సు ప్రయాణం ఇచ్చి, బస్సులను 3వేలు తగ్గించారని, దీంతో ప్రయాణికులు అరిగోస పడుతున్నారన్నారు. వచ్చేనెల 4న అన్ని డిపోల ఎదుట, హైదరాబాద్ బస్‌భవన్ ఎదుట ధర్నా చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో నాయకులు జూపాక శ్రీనివాస్, తోకల రమేశ్, గుమ్మడి వెంకన్న, ఆడెపు శంకర్, గూడూరి వైకుంఠం, గొల్లపల్లి చంద్రయ్య, పెండ్యాల రమేశ్, కోడిపుంజుల లక్ష్మి, కట్ట తేజేశ్వర్, తిగుట్ల రాములు, కాలువల రాయమల్లు పాల్గొన్నారు.

సంఘం అభివృద్ధికి పాటుపడదాం



ప్రతిజ్ఞ చేస్తున్న చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్

సుల్తానాబాద్: సభ్యులందరూ చేయి చేయి కలిపితేనే సహకార సంఘం అభివృద్ధి చెందుతుందని సింగిల్‌విండో చైర్మన్ శ్రీగిరి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో 71వ అఖిల భారత సహకార వారోత్సవాల సందర్భంగా ఆదివారం రైతులతో కలిసి సమావేశం నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ రాష్ట్రంలోనే సింగిల్‌విండో మొదటి స్థానంలో నిలిచిందని, రైతులకు రుణాలు ఇవ్వడమే కాకుండా వ్యాపారాలు, విద్యార్థులు, చిన్న, సన్నకారు రైతులకు రుణాలిచ్చి వ్యాపార అభివృద్ధికి తోడ్పడుతున్నామని తెలిపారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధి చెందితేనే అందులో ఉన్న రైతులు అభివృద్ధి చెందుతారన్నారు. అసిస్టెంట్ రిజిస్ట్రార్ ఎస్.వెంకటేశ్వర్లు, కోఆపరేటివ్ ఫ్యాకల్టీ వెంకటేశ్వర్లు, సంఘం పాలకవర్గ సభ్యులు పన్నాల రాములు, కూకట్ల ఓదెలు, పోచమల్లమ్మ, గెల్లు పద్మ, సంఘం కార్యదర్శి బూరుగు సంతోష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ అప్పల తిరుమల పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు ఎంపిక



లిఖిత

సుల్తానాబాద్: నిర్మల్ జిల్లాలో జరుగుతున్న 68వ ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలకు స్థానిక ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థిని పి.లిఖిత ఎంపికైనట్లు పాఠశాల చైర్మన్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ తెలిపారు. ఈనెల 14న కరీంనగర్ అంబేడ్కర్ స్టేడియంలో జరిగిన 17ఏళ్ల బాలికల బేస్‌బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్ర పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయమన్నారు. పాఠశాల పీఈటీలు సత్యం, ఇక్బాల్, శివ, సతీశ్ పాల్గొన్నారు.

వ్యాయామాన్ని పాఠ్యాంశంగా చేర్చాలి

సుల్తానాబాద్: వ్యాయామాన్ని పాఠ్యాంశంగా చేర్చితే ఆరోగ్యవంతమైన రాష్ట్రాన్ని నిర్మించే వీలుందని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి.నరేందర్‌రెడ్డి అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో వాకర్స్‌తో ఆదివారం ఆయన ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. పట్టభద్రుల ఎన్నికల్లో తనకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. స్పోర్ట్స్ క్లబ్ అధ్యక్షుడు ముస్త్యాల రవీందర్, కార్యదర్శి అమిరిశెట్టి తిరుపతి తదితరులు ఉన్నారు. కాగా అయ్యప్ప ఆలయ అభివృద్ధికి రూ.లక్ష విరాళాన్ని నరేందర్‌రెడ్డి ప్రకటించారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మినీ లైబ్రరీలు

పెద్దపల్లిరూరల్: ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల విద్యార్థులకు సులువుగా అర్థమయ్యే నీతికథల పుస్తకాలను లయన్స్‌క్లబ్ ప్రతినిధులు అందిస్తున్నారు. కాగా మండలంలోని రాఘవాపూర్, దేవునిపల్లి, గౌరెడ్డిపేట, ముత్తారంతోపాటు పట్టణంలోని పలు పాఠశాలు, చందపల్లి, బందంపల్లి, శాంతినగర్ పాఠశాలల్లో మినీ లైబ్రరీలు ఏర్పాటు చేసినట్లు క్లబ్ ప్రతినిధులు సతీశ్ తెలిపారు.

బియ్యం అందజేత

ఓదెల: ఓదెల గ్రామానికి చెందిన గాండ్ల ప్రకాంత్, కొండ్ర లస్మవ్వ ఇటీవల మృతిచెందారు. కాగా వారి కుటుంబాలకు స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు డాక్టర్ సతీశ్ ఆదివారం బియ్యం అందజేశారు. ఇరు కుటుంబాలకు 50కేజీల చొప్పున బియ్యం అందించారు.

ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

- పట్టించుకోని అధికారులు



పన్నూర్‌లో కంచె ఏర్పాటు చేయని ట్రాన్స్‌ఫార్మర్

రామగిరి: అధికారుల నిర్లక్ష్యంతో కంచెలు ఏర్పాటు చేయని ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద ప్రమాదం పొంచి ఉంది. పంటపొలాల వద్ద, ప్రజా అవసరాల నిమిత్తం గ్రామాల్లో విద్యుత్ అధికారులు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. కానీ వాటి చుట్టూ కంచె వేయడంలో విఫలమయ్యారు. మండలంలోని చాలాచోట్ల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె లేకపోవడంతోపాటు వాటి కోసం ఏర్పాటు చేసిన దిమ్మెలు సైతం చాలా తక్కువ ఎత్తులో ఉన్నాయి. మరికొన్ని చోట్ల దిమ్మెలు శిథిలావస్థకు చేరడంతో ఎప్పుడు కూలుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. మండల పరిధిలోని పన్నూర్ గ్రామంలో రహదారి పక్కన, కస్తూర్బా పాఠశాలకు వెళ్లే దారిలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె లేకపోవడంతో ప్రమాదకరంగా మారాయి. చిన్నపిల్లలు, వృద్ధులు నిత్యం రహదారిపై వెళ్లే వారు ఆందోళన చెందుతున్నారు. అలాగే పలు విద్యుత్ స్తంభాలు, లైన్లు కిందికి వేలాడుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారు.

ప్రజలు, రైతులకు తప్పని తిప్పలు

మండలంలోని పలు గ్రామాల్లో రక్షణలేని ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రజలకు, రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. చాలా గ్రామాల్లో నిత్యం ప్రజలు తిరిగే ప్రాంతాల్లో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. తక్కువ ఎత్తులో ఉండటంతో పాటు రక్షణ లేకపోవడంతో పశువులు మృత్యువాత పడే ప్రమాదం నెలకొంది. గతంలో పలు సంఘటనలు చోటు చేసుకున్నా పట్టించుకునేవారు కరువయ్యారు. పలుమార్లు సంబంధిత శాఖ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని స్థానికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని గ్రామాల్లో, పంటపొలాల వద్ద ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి రక్షణగా కంచెలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. శిథిలావస్థలో ఉన్న దిమ్మెలకు మరమ్మతు చేయాలని గ్రామస్తులు, రైతులు విన్నవిస్తున్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరించాలి

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌కు వినతి



ఎమ్మెల్యేకు విన్నవిస్తున్న కాలనీవాసులు

గోదావరిఖని: తమ కాలనీ సమస్యలు పరిష్కరించాలని స్థానిక పద్మావతికాలనీ వాసులు రామగుండం ఎమ్మెల్యే ఎంఎస్ రాజ్‌ఠాకూర్‌ను కోరారు. నగరంలోని క్యాంపు ఆఫీస్‌లో ఆదివారం ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలు విన్నవించారు. పదేళ్లుగా రోడ్లు, డ్రైనేజీ సరిగా లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. రాజీవ్ రహదారి స్కూప్స్ (కవిత టాకీస్) ఐస్‌క్రీమ్ పార్లర్ నుంచి కోర్టు వెనకాల వరకు గల మెయిన్ రోడ్డును తవ్వి మట్టి తీసి ఉంచడంతో కాలనీకి స్కూల్ వ్యాన్లు, ఆటోలు రాకుండా అయ్యాయన్నారు. అండర్‌గ్రౌండ్ కుండీలు పగిలి నీరు రోడ్డు మీదకు రావడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయని వాపోయారు. దీనికి ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించి త్వరలోనే సమస్యలు పరిష్కారమయ్యేలా చూస్తానని కాలనీవాసులకు హామీ ఇచ్చారు.

అర్హులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ

పాలకుర్తి: శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ కింద ముంపునకు గురైన గ్రామాలకు సంబంధించి ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో గత ప్రభుత్వ హయాంలో అనేక అవకతవకలు జరిగాయని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆరోపించారు. మండల పరిధిలోని కుక్కలగూడుర్ గ్రామంలో మక్కాన్‌సింగ్ సేవాసమితి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన కార్తీకమాస వనభోజనాల కార్యక్రమంలో ఎమ్మెల్యే హాజరై మాట్లాడారు. రామగుండం నియోజకవర్గం పరిధిలో శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్ట్ కింద ముంపునకు గురైన పొట్యాల, ముర్మూర్, మద్దిర్యాల, కుక్కలగూడుర్, వేంనూర్ గ్రామాల్లో ప్రభుత్వం ద్వారా సర్వే చేయించి అర్హులైన వారికి ఈనెలాఖరుకల్లా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ డబ్బులు చెల్లిస్తామని పేర్కొన్నారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తాను ఇచ్చిన మాట ప్రకారం చెల్లింపు చేస్తామని, ఇందుకు గాను రూ.22కోట్లు మంజూరు అవుతున్నట్లు వెల్లడించారు. గతంలో బీఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అన్నిరంగాలను నిర్వీర్యం చేసిందని, ప్రస్తుత ప్రజాపాలన కాంగ్రెస్ ప్రభుత్వం 11నెలల కాలంలోనే ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా హామీలు నెరవేరుస్తోందన్నారు. అనంతరం గ్రామస్తులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. మక్కాన్‌సింగ్ సేవాసమితి అధ్యక్షురాలు మనాలీఠాకూర్, వివిధ గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

డీటీపీ కోర్సు ఉచిత శిక్షణ

గోదావరిఖని: రామగుండం పారిశ్రామిక ప్రాంత యువత కోసం ఉచిత డీటీపీ శిక్షణ కోర్సు ప్రారంభిస్తున్నట్లు ఆర్జీ–1 పర్సనల్ మేనేజర్ కిరణ్‌బాబు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు శిక్షణ కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆధార్ కార్డు, కుల ధృవీకరణ సర్టిఫికెట్, పదో తరగతి పాస్ సర్టిఫికెట్, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో దరఖాస్తు నింపి జీవీటీసీలో ఇవ్వాలని పేర్కొన్నారు. స్థానిక తిలక్‌నగర్‌లోని స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌లో 45రోజుల పాటు శిక్షణ ఉంటుందన్నారు.

ధర్మారం మండలంలో 83శాతం సర్వే పూర్తి



సర్వే పనులు పరిశీలిస్తున్న ఎంపీడీవో

ధర్మారం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటి సర్వే ధర్మారం మండలంలో 83శాతం సర్వే పూర్తయినట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఐనాల ప్రవీణ్‌కుమార్ తెలిపారు. సర్వే పర్యవేక్షణలో భాగంగా ఆదివారం మండలంలోని కట్లెంరెడ్డిపల్లి, కమ్మరిఖాన్‌పేట, నాయకంపేట, పత్తిపాక, ప్రకాశ్‌నగర్, మల్లాపూర్ గ్రామాల్లో నిర్వహిస్తున్న సర్వే ప్రక్రియను ఎంపీడీవో పర్యవేక్షించారు. పూర్తయిన సర్వే ఫారాలను సంబంధిత సూపర్‌వైజర్ల ద్వారా మండల పరిషత్ కార్యాలయంలో అప్పగిస్తున్నారన్నారు. నిర్దేశించిన సమయంలోనే సర్వే పనులు పూర్తిచేస్తామని పేర్కొన్నారు. ఎన్యూమరేటర్లు, సూపర్‌వైజర్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పుస్తక పఠనం అలవర్చుకోవాలి



పెద్దపల్లిరూరల్: మాట్లాడుతున్న అన్నయ్యగౌడ్

పెద్దపల్లిరూరల్: గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనాన్ని అలవర్చుకుంటే పోటీ పరీక్షల్లో ప్రతిభా నైపుణ్యాలను ప్రదర్శించేందుకు అవకాశం ఉంటుందని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు అన్నయ్యగౌడ్ అన్నారు. పెద్దపల్లిలో ఆదివారం గ్రంథాలయ సంస్థ వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు మేకిన్ ఇండియా అంశంపై వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ప్రస్తుత సమాజంలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు పోటీ ఏర్పడిందన్నారు. ప్రతిభా నైపుణ్యాలున్న వారికే ఉద్యోగాలు దక్కుతున్నాయని వివరించారు. అందుకు అవసరమైన జ్ఞానాన్ని పెంచుకునేందుకు విద్యార్థులు, యువత గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం చేయాలని సూచించారు. ఇన్‌చార్జి కార్యదర్శి కరుణాకుమారి, సీఆర్‌పీ బాలసాని వెంకటేశం, శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

గ్రంథాలయం సందర్శన

గోదావరిఖనిటౌన్: స్థానిక పారోజ్ కాలనీలోని గ్రంథాలయాన్ని ఆదివారం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్యగౌడ్ సందర్శించారు. సంస్థ కార్యదర్శి కరుణ కుమారితో కలిసి రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ యువత గ్రంథాలయానికి ప్రతీరోజు వచ్చి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. పాఠకుల కోసం గ్రంథాలయానికి కావాల్సిన బుక్స్, సామగ్రిని ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్, ఆర్జీ–1 జీఎం సహకారంతో సమకూరుస్తామని పేర్కొన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించండి

మంథని: గ్రామాభివృద్ధికి చేసిన పనులకు బిల్లులు చెల్లించిన తర్వాత నూతన పనులకు శంకుస్థాపన చేయాలని సర్పంచ్‌ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు కనవేన శ్రీనివాస్ అన్నారు. మంథనిలోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తక్షణమే పెండింగ్ బిల్లులు చెల్లించాలని, లేని పక్షంలో సీఎం రేవంత్‌రెడ్డి వేములవాడ పర్యటన అడ్డుకుంటామన్నారు. మాజీ సర్పంచ్‌లు బుద్దార్థి రవి, పోగుల సదానందం, ఎర్రవెల్లి నరేశ్‌రావు, మంథని దుర్గమ్మ ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

- **నారాయణరెడ్డి వ్యాఖ్యలు ఖండించిన కాంగ్రెస్ నాయకులు**

మంథని: మంత్రి శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబుపై నిరాధార ఆరోపణలు చేసిన కాటారం మండలానికి చెందిన చల్లా నారాయణరెడ్డి వ్యాఖ్యలను మంథని కాంగ్రెస్ నాయకులు ఖండించారు. పార్టీ మండల అధ్యక్షుడు ఐలి ప్రసాద్, పట్టణశాఖ అధ్యక్షుడు పోలు శివ, నాయకులు వొడ్నాల శ్రీనివాస్, ముస్కుల సురేందర్‌రెడ్డి, ఉడుత పర్వతాలు ఉన్నారు.

- **చల్లా వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోవాలి**

బీజేపీ నాయకుడు చల్లా నారాయణరెడ్డి మాటలను కాంగ్రెస్ ప్రభుత్వం సీరియస్‌గా తీసుకొని మంత్రి శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబుపై విచారణ చేయాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఏగోళపు శంకర్‌గౌడ్, నాయకులు తగరం శంకర్‌లాల్ డిమాండ్ చేశారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడారు.

- **ఉనికి కోసమే దుద్దిళ్ల సోదరులపై ఆరోపణలు**

రామగిరి: నారాయణరెడ్డి, పుట్ట మధులు నియోజకవర్గంలో తమ ఉనికి కోల్పోతున్నామని కావాలనే మంత్రి శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబుపై ఆరోపణలు చేస్తున్నారని మాజీ ఎంపీపీ ఆరెల్లి దేవక్క, యూత్ కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు బర్ల శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు తోట చంద్రయ్య అన్నారు. ఆదివారం సెంటినరీకాలనీ శ్రీపాదభవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తమ నాయకులపై లేనిపోని ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. కాటం సత్యం, కొరుకొప్పుల తులసీరాంగౌడ్, ముస్త్యాల శ్రీనివాస్, గంట వెంకటరమణారెడ్డి, మైదం వరప్రసాద్, దాసరి శివ, కల్వల శంకర్, మద్ది రాజ్‌కుమార్, పీ.వీ.గౌడ్, ఆసం రాజు, బంక్ మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

- **నిరాధార ఆరోపణలు మానుకోవాలి**

రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబుపై నిరాధార ఆరోపణలు చేయడం మానుకోవాలని మంథని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తొట్ల తిరుపతియాదవ్ అన్నారు. బేగంపేటలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా మంత్రి ముందుకు వెళ్తున్నారన్నారు. మంత్రి, ఆయన సోదరుడిపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని, ఇప్పటికైనా బేషరతుగా వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలన్నారు. మండల అధ్యక్షుడు రోడ్డ బాపన్న, నాయకులు ఎల్లె రామ్మూర్తి, తీగల సమ్మయ్య, బండారు సదానందం, గొర్రె నరేశ్, ఎండీ చాంద్ పాషా, కలవేన శ్రీకాంత్, అంబీరు శ్రీనివాస్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు

మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఆయన సోదరుడు శ్రీనుబాబుపై నిరాధర ఆరోపణలు చేసిన కాటారం మండలానికి చెందిన చల్లా నారాయణరెడ్డిపై రామగిరి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ఉమ్మడి కమాన్‌పూర్ మాజీ జెడ్పీటీసీ గంట వెంకటరమణారెడ్డి తెలిపారు. అలాగే చానల్ ద్వారా ప్రచారం చేసిన రామగిరి మండలం నాగెపల్లికి చెందిన పూదరి సత్యనారాయణ గౌడ్‌పై సైతం ఫిర్యాదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

విచారణ చేపట్టాలి

బీఆర్‌ఎస్ మంథని ఇన్‌చార్జి పుట్ట మధు హత్య కుట్రపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టాలని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శంకేశీ రవీందర్ డిమాండ్ చేశారు. సెంటినరీకాలనీలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పుట్ట మధు హత్యకు కుట్ర జరిగిందని కాటారం మాజీ జెడ్పీటీసీ చల్లా నారాయణరెడ్డి వీడియో విడుదలపై విచారణ నిర్వహించాలన్నారు. బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలన్నారు. కమాన్‌పూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పూదరి సత్యనారాయణగౌడ్, పట్టణ అధ్యక్షుడు కాపురబోయిన భాస్కర్, నాయకులు మ్యాదరబోయిన కుమార్‌యాదవ్, బుర్ర శంకర్, పుల్లెల కిరణ్, దామెర శ్రీనివాస్ పాల్గొన్నారు.

- **బీఆర్‌ఎస్ నాయకుల డిమాండ్**

కమాన్‌పూర్: మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుపై గతంలో జరిగిన హత్యా కుట్రపై ప్రభుత్వం సమగ్ర విచారణ చేపట్టేలా చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బొమ్మగాని అనిల్, తాటికొండ శంకర్, గుర్రం లక్ష్మిమల్లు, మేకల సంపత్, కొండ వెంకటేశ్, నీలం శ్రీనివాస్, పొన్నం రాజేశ్వరి, చిందం తిరుపతి, నల్లగొండ నాగరాజు పాల్గొన్నారు.

- **అయ్యప్ప ఆలయ కమిటీ అధ్యక్షుడిగా బుచ్చిరెడ్డి**



సుల్తానాబాద్: అయ్యప్పస్వామి ఆలయ సన్నిధిలో దేవాలయ కమిటీ అధ్యక్షుడిగా అబ్బు బుచ్చిరెడ్డిని ఎన్నుకున్నారు. పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో ఆదివారం ఆలయ కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా ఆరెపల్లి రత్నం, టీకే ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా మాటేటి శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా దుగ్యాల సంతోష్‌రావు, మాటేటి సంజీవ్‌కుమార్, టీకే తిరుపతి, చేపూరి రవీందర్, కోశాధికారిగా అల్లం సత్యనారాయణ, ప్రచార కార్యదర్శులుగా లెక్కల గంగాధర్, ఎర్రవెల్లి సుధీర్‌రావు, సముద్రాల విష్ణు, కార్యవర్గ సభ్యులుగా గరిగె శ్రీనివాస్, నల్లవెల్లి సతీశ్, కందునూరి కుమార్, రామిడి శ్రీనివాస్, ముఖ్య సలహాదారులుగా మిట్టపల్లి మురళీధర్ గురుస్వామి, సాయిరి మహేందర్ గురుస్వామి, ఎడవల్లి జైపాల్‌రెడ్డి గురుస్వాములను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం నుంచి అయ్యప్పస్వామి దీక్షాపరులకు నిత్య బిక్ష ఉచితంగా ఏర్పాటు చేయనున్నట్లు కమిటీ పేర్కొంది. పిడుగు పోచాలు, ఎల్లె శాంతయ్య, టీకే రాజు, వేగోళం శంకర్‌గౌడ్, కొయ్యడ చిరంజీవి, చిన్నాల రమేశ్, ఆరెపల్లి ప్రవీణ్, రామిడి రవీందర్, తాండ్ర శ్రీధర్, తమ్మనవేని సతీశ్, బండారి సూర్యం, వెంకటేశ్, గెల్లు మనోహర్, కందునూరి సతీశ్, పూసాల రామకృష్ణ పాల్గొన్నారు.



రామగుండం: రైల్వేస్టేషన్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో ప్రమాదకర గుంతతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. డ్రైనేజీ చాంబర్‌ను రోడ్డుకు సమానంగా తారు వేయకపోవడంతో ద్విచక్ర వాహనదారులు గుర్తించక ప్రమాదాల బారిన పడుతున్నారు. ఛాంబర్‌ను లెవల్ చేయాలని స్థానిక కార్పొరేటర్, వాహనదారులు కోరుతున్నారు.

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 97053 46608, 98499 71500

సింగరేణి వార్తలు

కాంట్రాక్టు కార్మికునికి పరామర్శ



పరామర్శిస్తున్న జనక్ ప్రసాద్

గోదావరిఖని: సింగరేణి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాంట్రాక్టు కార్మికుడు రామిండ్ల రమేశ్‌ను రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ ఆదివారం పరామర్శించారు. రమేశ్ ఓసీపీ–1లో పనిచేస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తు కాలు విరగడంతో సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. విషయం తెలుసుకున్న జనక్‌ప్రసాద్ అక్కడకు వెళ్లి ప్రమాద ఘటన విషయాన్ని తెలుసుకున్నారు. డాక్టర్, సిబ్బందితో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు. త్వరలోనే సీఎండీతో మాట్లాడి కాంట్రాక్ట్ కార్మికులకు కూడా రిఫరల్ సదుపాయం కల్పించాలని కోరుతామన్నారు. నాయకులు నరసింహారెడ్డి, ధర్మపురి, కాంపెల్లి సమ్మయ్య, దాస్, వికాస్‌కుమార్‌యాదవ్, ఉడుత శంకర్, కిరణ్‌రెడ్డి ఉన్నారు.

అడిషనల్ కలెక్టర్‌కు సన్మానం



సన్మానిస్తున్న జీఎం వెంకటయ్య

గోదావరిఖని: జిల్లా అడిషనల్ కలెక్టర్ డి.వేణును ఆర్జీ–2 జీఎం బి.వెంకటయ్య ఆదివారం కలిశారు. మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందించి సన్మానించారు. అనంతరం భూసేకరణ, ఆర్‌అండ్ ఆర్ ప్యాకేజీ తదితర విషయాలపై మాట్లాడారు. జీఎం వెంట ఎస్‌వోటూ జీఎం ఎం.రాముడు, సీనియర్ ఎస్టేట్స్ అధికారి సునీత ఉన్నారు.

సీపీఎం మహాసభలు విజయవంతం చేయండి



రామగిరి: మాట్లాడుతున్న భూపాల్

మంథని: రామగుండం పారిశ్రామిక ప్రాంతం ఎన్టీపీసీలో ఈ నెల 23, 24వ తేదీల్లో జరిగే సీపీఎం జిల్లా మహాసభలు విజయవంతం చేయాలని సీపీఎం నాయకుడు బూడిద గణేశ్, ఆర్ల సందీప్ కోరారు. ఈ మేరకు మంథనిలో ఆదివారం మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను న్యాయవాది కేతిరెడ్డి రఘోత్తంరెడ్డి ఆవిష్కరించారు.

జయప్రదం చేయాలి

రామగిరి: మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్ కోరారు. సెంటినరీకాలనీలో ఆదివారం జిల్లా కార్యదర్శి ఎరవెల్లి ముత్యాల్‌రావు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా మహాసభలు నవంబర్ 23, 24న ఎన్టీపీసీలోని కామ్రేడ్ సీతారాం ఏచూరి ప్రాంగణంలో జరగనున్నాయని తెలిపారు. మొదటి రోజు వేలాదిమందితో ప్రదర్శన, బహిరంగ సభ, రెండో రోజు ప్రజా పోరాటాలకు నాయకత్వం వహిస్తున్న ప్రతినిధుల సభ ఉంటుందన్నారు. మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు వేల్పుల కుమార్‌స్వామి, ఎం.రామచారి, జ్యోతి, మండే శ్రీనివాస్, సీపెల్లి రవీందర్, అశోక్, బిక్షపతి, రాజమౌళి పాల్గొన్నారు.

మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో జిల్లా బీజేపీ నాయకులు



పెద్దపల్లిరూరల్: మహారాష్ట్ర అసెంబ్లీకి జరగనున్న ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థికి మద్దతుగా మహిళా మోర్చా ప్రతినిధులు విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. రాష్ట్రం నుంచి ఆరుగురు మహిళా మోర్చా ప్రతినిధుల బృందం సభ్యులు సోమారపు లావణ్యతో పాటు సుధ, మాధవి, నీలిమ, సంగీత తదితరులు మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్నారు. జిల్లాకు చెందిన సోమారపు లావణ్య తదితరులు చార్‌కోప్ బీజేపీ అభ్యర్థి యోగేష్ సాగర్‌కు మద్దతుగా ఇంటింటి ప్రచారం, బూత్ కమిటీ, శక్తి కేంద్రాలు, కార్నర్ మీటింగులు నిర్వహిస్తున్నట్లు వారు పేర్కొన్నారు

నియామకం

కమాన్‌పూర్: బీఆర్‌ఎస్ మండల కన్వీనర్‌గా సిద్దిపల్లె మాజీ సర్పంచ్ తాటికొండ శంకర్‌ను నియమిస్తున్నట్లు పార్టీ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి పుట్ట మధు ఆదివారం మండల కేంద్రంలో ప్రకటించారు. మండల కన్వీనర్‌గా బాధ్యతలు అప్పగించినందుకు శంకర్ కృతజ్ఞతలు తెలిపారు.

చికిత్స పొందుతూ ఒకరు మృతి

జ్యోతినగర్: ప్రమాదవశాత్తు కిందపడి తలకు బలమైన గాయంతో చికిత్స పొందుతున్న బైక్ మెకానిక్ కాసు సతీశ్(42) శనివారం రాత్రి మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. ఎన్టీపీసీ రామగుండం కృష్ణానగర్‌లో నివసిస్తున్న కాసు సతీశ్ బైక్ మెకానిక్‌గా పని చేస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం ఇంటికి వస్తున్న క్రమంలో అస్వస్థతకు గురై రోడ్డుపై పడిపోయాడు. దీంతో స్థానికులు, కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం గోదావరిఖని ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యుల సూచన మేరకు కరీంనగర్‌లోని ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి కొమురయ్య ఎన్టీపీసీ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మృతుడికి భార్య పద్మ, కుమార్తెలు శృతి, శ్రావ్య ఉన్నారు. సతీశ్ మృతికి సంతాపంగా ఎన్టీపీసీ, రామగుండం, గోదావరిఖనిలోని మెకానిక్ అసోసియేషన్ సభ్యులు సంతాపం ప్రకటించి మెకానిక్ షెడ్లు మూసివేసి అంత్యక్రియల్లో పాల్గొన్నారు.